క్లుప్తంగా

పశువుల షెడ్డు పరిశీలన

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని అప్పాజీపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పశువుల షెడ్డును సోమవారం ఎంపీడీఓ చంద్రశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం కింద రైతులు పశువుల షెడ్డు నిర్మించుకుంటే రూ.60 వేలు చెల్లిస్తామన్నారు. మండలంలో 30 షెడ్డులు మంజూరు కాగా నిర్మాణ దశలో ఉన్నయన్నారు.

డంప్‌యార్డు వద్దు



నిరాహారదీక్షల్లో పాల్గొన్న జేఏసీ నాయకులు

నర్సాపూర్: ప్యారానగర్‌లో డంప్‌యార్డు వద్దంటూ నర్సాపూర్‌లో జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 8వ రోజుకు చేరాయి. దీక్షల్లో బీజేపీ రాష్ట్ర రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ పాల్గొని మాట్లాడుతూ.. డంప్‌యార్డును ప్యారానగర్ నుంచి ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తాజా మాజీ చైర్మన్ రాజుయాదవ్, ఆయా పార్టీల నాయకులు భిక్షపతి, దావూద్, కృపాచారి, కుమార్, నగేష్ తదితరలు పాల్గొన్నారు.

సమయం వృథా చేయొద్దు

నర్సాపూర్: విద్యార్థులు తమ సమయాన్ని వృథా చేయొద్దని వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఎస్‌బీఎన్ మూర్తి విద్యార్థులకు హితవు పలికారు. కృషి విజ్ఞాన గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శ్రీరామకృష్ణ మఠం సహకారంతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి అలవాట్లను పెంపొందించుకోవాలని, ధ్యానం, యోగాలాంటివి చేయాలని, ప్రణాళికతో దైనందిన సమావేశంలో కృషి విజ్ఞాన సంస్థ చైర్మన్ లక్ష్మీకాంతారావు, ఎంఈఓ తారాసింగ్, కాలేజీ లెక్చరర్లు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): ఖేడ్ నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని మక్తలక్ష్మాపూర్‌లో శివాలయంలో దేవతా విగ్రహాల ప్రతిష్ఠలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

గీతా విద్యాసంస్థల చైర్‌పర్సన్‌కు అవార్డు



ఆడిటోరియంలో అవార్డు అందుకుంటున్న గీతా విద్యా సంస్థల చైర్‌పర్సన్ ఉష

తూప్రాన్: పట్టణంలోని గీతా విద్యా సంస్థల చైర్‌పర్సన్ పి.ఉష ఉత్తమ వుమెన్ ఎడ్ ప్రెన్యూర్ అవార్డు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని ఎన్ఐఎంఎస్ఎంఐ ఆడిటోరియంలో నిర్వహించిన సెమినార్‌లో రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్ నర్సింహారెడ్డి, విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

పాఠశాలలో ఆర్టిఫిషియల్ తరగతులు ప్రారంభం



ఏఐ తరగతులు ప్రారంభిస్తున్న మండల విద్యాధికారి యాదగిరి

నిజాంపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో తరగతులు ప్రారంభిస్తున్నట్లు మండల విద్యాధికారి యాదగిరి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో తరగతులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏఐ తరగతులు నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం అరుణ, రాజేందర్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివరాత్రికి ఆలయాలు ముస్తాబు



చిన్నశంకరంపేట(మెదక్): సోమేశ్వరాలయం

26 నుంచి సోమేశ్వర బ్రహ్మోత్సవాలు

చిన్నశంకరంపేట(మెదక్): మహాశివరాత్రి సందర్భంగా చాళుక్యుల కాలంలో నిర్మించిన చరిత్రాత్మకమైన మండల కేంద్రంలోని సోమేశ్వరాలయ 54వ బ్రహ్మోత్సవాలు నాలుగు రోజుల పాటు జరగనున్నాయి. బుధవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, గణపతి పూజ, పుణ్యావాచనం, అఖండదీపారాధన, ధ్వజారోహణ, నాగుల పూజ, సోమేశ్వర స్వామి పల్లకీ సేవ నిర్వహిస్తారు. గురువారం మహన్యాసపూర్వక రుద్రాభిషేకం మంత్రపుష్పం, బండ్లు తిప్పుట, లక్ష్మీవేంకటేశ్వర స్వామి తులసిదళం పూజ నిర్వహణ జరుగును. శుక్రవారం పోచమ్మ బోనాలు, భద్రకాళి, వీరభద్రస్వామి వస్త్రాయణం, భైరవ పూజ చేస్తారు. శనివారం అభిషేకం, రుద్రహోమం, లక్ష పుష్పార్చన, చండిక సోమేశ్వరస్వామి కల్యాణం, రథోత్సవం నిర్వహిస్తారు.



బొడ్మట్‌పల్లి వీరభద్రాలయ ముఖద్వారం

రుద్రారంలో సంగమేశ్వరాలయ ఉత్సవాలు

మండలంలోని రుద్రారంలో వెలసిన కామేశ్వరీదేవి సమేత సంగమేశ్వరాలయ 76వ వార్షికోత్సవాలు మహాశివరాత్రి నుంచి నిర్వహించనున్నట్లు మాజీ సర్పంచ్ లక్ష్మణ్ తెలిపారు. నాలుగు రోజుల పాటు హోమం, బండ్ల ఊరేగింపు, కల్యాణోత్సవం జరగనున్నాయన్నారు.

కోరిన కోర్కెలు తీర్చే బొడ్మట్‌పల్లి వీరభద్రుడు

టేక్మాల్(మెదక్): మండంలోని బొడ్మట్‌పల్లి గుట్టపై వెలసిన భద్రకాళీ సమేత వీరభద్రుడు శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్నాడు. శివరాత్రికి భక్తులంతా ఉపవాసాలు ఉంటూ శివనామస్మరణ చేస్తారు. ఉపవాస దీక్షపరులంతా పండ్లతో వీరభద్రుడికి పూజలు చేసి ఉపవాస దీక్షలు వదులుతారు. రాత్రి వేళల్లో భజన కార్యక్రమాన్ని చేసి, శివ నామస్మరణతో జాగరణ చేస్తారు. ఆలయాన్ని శుద్ధి చేసి విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

900 ఏళ్ల నాటి రామలింగేశ్వర స్వామి ఆలయం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మహాశివరాత్రి ఉత్సవాలను మండలంలోని చండూర్ గ్రామ రామలింగేశ్వరస్వామి ఆలయం ముస్తాబవుతోంది. 900 ఏళ్ల చరిత్రగల ఆలయం. ఈ సందర్భంగా బుధవారం జరుగనున్న ప్రత్యేక పూజలకు వివిధ ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. గ్రామసస్తులు, ఆలయ కమిటీ సభ్యులు గుట్టపై ఆలయంతో పాటు గ్రామం చూట్టు రథోత్సవం నిర్వహిస్తారు. బుధవారం శివ కల్యాణం, స్వామివారికి అభిషేకాలు, రుద్రాభిషేకం, సత్యనారాయణ స్వామివ్రతాలు, అమ్మవారికి ఓడిబియ్యం, శివస్వాముల దీక్ష విరమణ, ఉపవాస దీక్షలు, గురువారం అభిషేకం, బండ్ల ఊరేగింపు, రాత్రి వేళలో సాంస్కృతిక కార్యక్రమాలు, శుక్రవారం పాచిబండ్ల ఊరేగింపు, రాత్రి సమయంలో రథోత్సవం, లంకదహనం కార్యక్రమాలు జరుగనున్నాయి.



చండూర్‌లో ముస్తాబైన రథం

రోడ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది

ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామీణ ప్రజల సౌకర్యార్థం వేసిన రోడ్డును కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. ఉసిరికపల్లి చౌరస్తా నుంచి పోతులబోగూడ వరకు పాడైపోయిన సింగిల్ రోడ్డు స్థానంలో డబుల్ రోడ్డు వేసేందుకు తీవ్రంగా కృషి చేసి అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో నిధులు మంజూరు చేశామన్నారు. సోమవారం పూర్తి అయిన బీటీ రోడ్డు పనులు పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, నాయకులు మహేశ్‌గుప్తా, హరికృష్ణ, కృష్ణారావు, మన్సూర్, చంద్రగౌడ్, యాదగౌడ్, తదితరులు ఉన్నారు.



ఉసిరికపల్లి బీటీ రోడ్డుని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

దాతల సాయం వెలకట్టలేనిది

నీటి ఎద్దడి నివారణ కోసం దాతలు అందిస్తున్న సహాయం వెలకట్టలేనిదని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండల పరిధి పాంబండ గ్రామంలోని మల్లన్న ఆలయం వద్ద మాజీ జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన బోరు మోటార్‌ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నేతలు, బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న కాంగ్రెస్

వెల్దుర్తి(తూప్రాన్): నర్సాపూర్ నియోజకవర్గ అభివృద్ధిని కాంగ్రెస్ అడ్డుకుంటుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆమె మాట్లాడుతూ .. నియోజకవర్గానికి మంజూరైన కల్యాణలక్ష్మి డబ్బులను ఇంతవరకు పంపిణీ చేయలేదన్నారు. నర్సాపూర్ మున్సిపాలిటీకి మంజూరైన 12 కోట్ల నిధులు నిలిపి వేయడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయినట్లు తెలిపారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



నర్సాపూర్: బీజేపీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



కౌడిపల్లి(నర్సాపూర్): కంచన్‌పల్లిలో ప్రచారం చేస్తున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్

నర్సాపూర్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ నాయకులు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ప్రచారం చేపట్టారు. బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి మద్దతుగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పలువురు నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టభద్రులు తమ పార్టీ వైపు ఉన్నారని అంజిరెడ్డి విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రమేశ్‌గౌడ్ వెంట పార్టీ నాయకులు నగేష్, రామ్‌నాయక్, దాసు, గణేశ్ తదితరులు మండలంలోని కాగజ్‌మద్దూర్, నత్నాయిపల్లి, కొండాపూర్, తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు.

కంచన్‌పల్లిలో..

కౌడిపల్లి(నర్సాపూర్): బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కొమురయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీగా అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, మండలాధ్యక్షుడు రాకేశ్, ఇతర నాయకులు ఓటర్లను కోరారు.

కంప్యూటర్‌పై అవగాహన

నర్సాపూర్: విద్యార్థులకు కంప్యూటర్ ఆధారిత విద్యను అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఎంఈఓ తారాసింగ్ అన్నారు. విద్యార్థుల్లో కనీస అభ్యర్థన సామర్థ్యాన్ని పెంచేందుకు ఆర్టిఫిషిల్ ఇంటిలిజెన్స్ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల–2 ఎంపిక అయిందని ఆయన వివరించారు. అందులో భాగంగా సోమవారం విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు ప్రారంభించామని చెప్పారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రశేఖర్, పాఠశాల హెచ్‌ఎం మక్సూద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయ ఆదాయం రూ.27.12 లక్షలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మ ఆలయం వద్ద టెండర్ల ద్వారా అమ్మవారి ఆలయానికి రూ.27.12 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ రంగారావు తెలిపారు. సోమవారం ఈఓ రంగారావు, పర్యవేక్షకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయం వద్ద వేలంపాట నిర్వహించారు. ఈ వేలంలో కొబ్బరికాయల అమ్మకానికి చల్ల కుమార్ రూ.18.30 లక్షలకు, టెంట్‌హౌస్ నిర్వహణకు నర్సాపూర్‌కు చెందిన పద్మనాభం రూ.8.45 లక్షలకు దక్కించుకున్నాడు. పార్కింగ్ కోసం ప్రవీణ్ రూ. 35 వేలకు పాడుకున్నాడు. అమ్మవారి ఆలయం వద్ద ఉన్న సాగుభూమి నష్టపోతున్న రైతుకు ఏడాదికి రూ. 3 లక్షలు ఇవ్వాలని తీర్మానించామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్‌లు శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మల్లేశం, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటుహక్కు వినియోగించుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): పట్టభద్రులు, ఉపాధ్యాయులు తప్పకుండా వారి ఓటుహక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్ కమలాద్రి కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్‌కు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. శివ్వంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓటర్లందరికీ బీఎల్‌ఓలకు పోల్ చిట్టీలు అందజేస్తామన్నారు.



వెంకట్‌రావుపేట పాఠశాలలో అన్నం, నీళ్ల చారుతో భోజనం తింటున్న విద్యార్థులు

మధ్యాహ్న భోజనంలో గుడ్డేది ?

- కానరాని నాణ్యత
- అమలుకు నోచుకోని మెనూ

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వ పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, మెనూ అమలు చేయకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అధికారులు చెప్తున్నా.. అవి మాటల వరకే పరిమితమవుతున్నాయి. మధ్యాహ్న భోజనంలో గుడ్డు కోతతో, నీళ్ల చారే పేద విద్యార్థులకు దిక్కవుతుంది. మండలంలోని వెంకట్‌రావుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజనంలో గుడ్డు పెట్టడంలేదు. మెనూ ప్రకారం కాకుండా నీళ్ల చారుతో భోజనం పెట్టి చేతులు దులుపుకుంటున్నారు. ఈ విషయంపై పాఠశాల హెచ్‌ఎం ప్రవీణ్‌ను ప్రశ్నిస్తే, బర్డ్‌ఫ్లూ భయంతో గుడ్డు పెట్టలేదన్నారు. శనివారం వెజ్ బిర్యాని పెట్టాల్సి ఉండగా.. అల్లాదుర్గం బాలుర పాఠశాలలో ఆలుగడ్డ, టమాటతో నీళ్ల కూర చేసి విద్యార్థులకు వడ్డించారు. అదేరోజు మెదక్ ఆర్డీఓ రమాదేవి పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. భోజనం నాణ్యతగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైన జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పీర్య తండాలో నీటి సమస్య

కౌడిపల్లి(నర్సాపూర్): మండల పరిధిలోని పీర్య తండాలో తీవ్రమైన తాగు నీటి సమస్య ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని తండావాసులు రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. సోమవారం ఈ సందర్భంగా తండావాసులు మాట్లాడుతూ.. తండాలో సుమారు వంద కుటుంబాలు ఉండగా, రెండు రక్షిత మంచి నీటి ట్యాంకులున్నాయన్నారు. కొద్ది నెలలుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో, ట్యాంకులకు నీరు అందకపోవడంతో తీవ్రమైన నీటి సమస్య నెలకొందన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా, వారు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇన్నాళ్లు పనులు మానుకొని నీటికోసం పంట పొలాల వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని, ప్రస్తుతం భూగర్భజలాలు తగ్గడంతో, బోరుబావుల యజమానులు పొలం వద్ద నీళ్లు తీసుకువెళ్లడానికి నిరాకరిస్తున్నారని తెలిపారు. పీర్యతండా ప్రత్యేకాధికారిగా మిషన్ భగీరథ ఏఈ ఉన్నప్పటికీ సమస్య పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి తమ తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు.



పీర్యతండాలో నీటి సమస్య తీర్చాలని రోడ్డుపై నిరసన తెలుపుతున్న తండావాసులు

మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎస్‌బీఆర్ జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్ చాంపియన్ పోటీలో ఇద్దరు విద్యార్థులు బంగారు పతకాలు సాధించి తమ ప్రతిభ చాటారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జూల మైత్రి, 7వ తరగతి చదువుతున్న చంద్రప్రియ ఆదివారం సంగారెడ్డిలో జరిగిన వారియర్ మార్షల్ ఆర్ట్స్ ఆకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్‌బీఆర్ జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ అండర్–14, విభాగంలో వారు బంగారు పతకాలను సాధించారు. సోమవారం ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రమేశ్, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రమేశ్ మాట్లాడుతూ.. మార్షల్ ఆర్ట్స్‌తో శారీరక, మానసిక దృఢత్వాని సాధించవచ్చని అన్నారు.

కట్టు కాల్వ తొలగింపు

శివ్వంపేట(నర్సాపూర్): చెరువులోకి వర్షపు నీరు వచ్చేందుకు ఏర్పాటు చేసిన కట్టు కాల్వను తొలగించిన సంఘటన మండలంలోని చెండి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామ పరిధిలో ఉన్న లోతన్ చెరువులోకి వర్షపు నీరు చేరేందుకు పూర్వకాలం నుంచి ఉన్న కట్టు కాలువను సోమవారం రియల్ వ్యాపారులు తొలగించారని రైతులు వాపోయారు. కట్టు కాల్వ తొలగింపుతో పాటు పచ్చని చెట్లను సైతం నరికివేసినట్లు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా చెట్లను తొలగించడంతో పాటు కట్టు కాల్వను పూడ్చి వేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ విషయం గురించి ఇరిగేషన్ ఏఈ సునీత వివరణ కోరగా, కట్టు కాల్వ తొలగించిన విషయం తన దృష్టికి రాలేదని పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



తొలగించిన కట్టు కాల్వ, చెట్లు

నిర్ణీత ధరలకే విక్రయించాలి

నర్సాపూర్: విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందుల డీలర్లు నిర్ణీత ధరలకే అమ్మాలని, ఎక్కువ ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి వినయ్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని పలు విత్తనాలు, ఎరువుల డీలర్ల దుకాణాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ డీలరు లైసెన్స్ కల్గి ఉండాలని, ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలన్నారు. ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని, స్టాకు రికార్డులను వ్యవసాయ శాఖ అధికారులకు అందజేయాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి దీపిక ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పోలింగ్ చీటీల పంపిణీ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చండూర్ గ్రామంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్లైన పట్టాభద్రులకు పోలింగ్ చీటీలు పంపిణీ చేశామని అంగన్‌వాడీ టీచర్లు శశికళ, యాదమ్మ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హులైన ప్రతీ ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు.

◆ కొనసాగుతున్న మల్లన్న ఉత్సవాలు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని మానెపల్లి, చెరీల గ్రామాల్లో యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లన్న ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం అగ్నిగుండాలు, మల్లికార్జునస్వామి కల్యాణం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ ఏటీఎంలో చోరీకి యత్నం

నర్సాపూర్: నర్సాపూర్ జాతీయ రహదారి పక్కన ఉన్న ఏటీఎంలో గుర్తు తెలియని దొంగలు చోరీకి ప్రయత్నించారని ఎస్ఐ లింగం చెప్పారు. ఎస్ఐ మాట్లాడుతూ.. ఆదివారం రాత్రి జాతీయ రహదారి పక్కన ఉన్న యాక్సిస్ బ్యాంకుకు చెందిన ఏటీఎంలో చోరీకి ప్రయత్నించి, మిషన్‌ను ధ్వంసం చేసినా.. డబ్బులు బయటకు రాలేదని ఆయన చెప్పారు. బ్యాంకు అధికారి యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. దొంగలను త్వరలోనే పట్టుకుంటామని వివరించారు.

◆ సీఆర్పీల కుటుంబాలకు ఆర్థికసాయం



చేగుంట(తూప్రాన్): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీఆర్పీల కుటుంబాలకు వెల్దుర్తి ఎంఈఓ యాదగిరితో పాటు మండల నోడల్ అధికారి సీతారాంలు సోమవారం ఆర్థిక సాయం అందించారు. రోడ్డు ప్రమాదంలో మక్కరాజీపేట కాంప్లెక్స్ సీఆర్పీలు గొల్లపల్లికి చెందిన రమేశ్, చందాయిపేటకు చెందిన శ్రీనివాస్‌లు మృతి చెందగా బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాధిత కటుంబాలకు రూ.60 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం అమరశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు విజయసేనారెడ్డి, సీఆర్పీలు రాజు, ఆగమయ్య, రమేశ్, వినోద తదితరులు ఉన్నారు.

◆ చదువుతోనే సమాజంలో గుర్తింపు

కౌడిపల్లి(నర్సాపూర్): చదువుతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తుందని ఎంజేపీ తునికి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ హరిబాబు అన్నారు. సోమవారం మండల పరిధిలోని తునికి ఎంజేపీ బీసీ బాలుర పాఠశాల, కళాశాలలో వార్షికోత్సవం, వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డిప్యూటీ వార్డెన్ లక్ష్మణ్, ఇన్‌చార్జి ఏటీపీ అమర్‌సింగ్, ఉపాధ్యాయులు విక్రమ్, సురేశ్, అనిల్‌కుమార్, హన్మంతు, అలివేణి, జయ, తదితరులు పాల్గొన్నారు.

◆ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హవేళిఘణాపూర్(మెదక్): ఎస్ఎస్ఎఫ్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు. మెదక్ మండలంలోని మంభోజిపల్లి ఎస్ఎస్ఎఫ్ సబ్ స్టేషన్ ఫీడర్ పరిధిలోని చిట్యాల, జానకంపల్లి, తండాలతో పాటు కొల్చారం మండలం రాంపూర్ గ్రామాలకు మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

◆ సమస్యలు పరిష్కరిస్తాం



చిన్నశంకరంపేట(మెదక్): బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి కోరారు. సోమవారం నార్సింగి మండలంలోని వల్లూర్, శేరిపల్లి గ్రామాల్లో ఓటర్లను కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించాలని కోరారు. సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నార్సింగి బీజేపీ పట్టణాధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

◆ కాంగ్రెస్ నాయకుల ప్రచారం



చేగుంట(తూప్రాన్): పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిని గెలిపించాలని పీసీసీ ఉపాధ్యక్షుడు సాంబయ్య అన్నారు. సోమవారం చేగుంటలో నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పట్టభద్రుల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, మండలాధ్యక్షుడు నవీన్, యూత్ కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ అధ్యక్షుడు ఉసామొద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): కాంగ్రెస్ ఎమ్మెల్సీ టీచర్స్, పట్టభద్రుల అభ్యర్థికి మద్దతుగా సోమవారం ఆ పార్టీ శ్రేణులు కిష్టాపూర్, చిన్నఘనపూర్‌లో ప్రచారం నిర్వహించాయి.

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు రమేశ్‌చారి, పెంటాగౌడ్, కృష్ణగౌడ్ ప్రచారం చేశారు. కార్యక్రమంలో శోభన్‌రాజ్‌గౌడ్, పాలాట రమేష్, సత్యనారాయణ, మహిపాల్‌రెడ్డి, అశోక్‌యాదవ్, పాండుగౌడ్, ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

తునికిలో ..

కౌడిపల్లి(నర్సాపూర్): కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. సోమవారం మండలంలోని వెల్మకన్నె, తిమ్మాపూర్, తునికి, హరిచంద్ తండా తదితర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాస్, లక్ష్మణ్, రాములు, ప్రభు తదితరులు పాల్గొన్నారు.